క్లుప్తంగా

మహామృత్యుంజయేశ్వరుని దర్శించుకున్న జెడ్పీ చైర్‌పర్సన్



స్వామివారి తిరువీధిలో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

కవిటి: ముత్యాలపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన మహామృత్యుంజయేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠ ఉత్సవాలు మంగళవారం ఉదయం తిరువీధుల కార్యక్రమంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా శ్రీకాకుళం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, కవిటి సర్పంచ్ పూడి లక్ష్మణరావులు మహామృత్యుంజయేశ్వరస్వామి, మోక్షసీతారామాలయాలలో దర్శనాలు చేసుకుని ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు ఆమెకు వేద ఆశీర్వచనం అందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

మంత్రి అప్పలరాజు పరామర్శ



పరామర్శలో మంత్రి అప్పలరాజు తదితరులు

మందస: మూలిపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తెలుకుల గురుమూర్తి ఇటీవల మరణించారు. దీంతో అతన్ని కుటుంబాన్ని మంత్రి సీదిరి అప్పలరాజు మంగళవారం పరామర్శించారు. గురుమూర్తి లేనిలోటు కలచివేసిందన్నారు. పరామర్శలో ఎంపీపీ డొక్కరి దానయ్య, సర్పంచ్ గుసిరి వెంకటరావు, పార్టీ నాయకులు దద్ద కిరణ్‌కుమార్, తెలుకుల డొంబురు, కలిగాన ప్రశాంత్, పిట్ట భీమారావు, సూరన్న, తులసయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మామిడి కృష్ణారావు ఉన్నారు.

జలంత్రకోటలో నేత్ర వైద్య శిబిరం

కంచిలి: జలంత్రకోట గ్రామంలో హెల్ప్ ఏజ్ ఇండియా సౌజన్యంతో ఆరోగ్యవరం కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఇందులో 35 మందికి వైద్యులు కంటి పరీక్షలు చేశారు. వీరిలో 15 మందికి శస్త్రచికిత్స, ఐదుగురికి కంటి అద్దాలు అవసరమని గుర్తించారు. పది మందికి మందులు అందజేశారు.

జగనన్న భూహక్కు పత్రాలు పంపిణీ

కవిటి: రైతుల సంక్షేమం, అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని కవిటి పీఏసీఎస్ చైర్మన్ దేవరాజ్ సాహూ అన్నారు. మాణిక్యపురంలో సచివాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో రైతులకు జగనన్న భూహక్కు పత్రాలను అందజేశారు. డిజిటల్ పాస్‌పుస్తకాలతో కూడిన పత్రాలను 1200 మంది రైతులకు పంపిణీ చేసినట్టు రెవెన్యూ అధికారులు వివరించారు.

నిధులు మంజూరుకు ఎమ్మెల్సీ వినతి



కరుణాకర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ రామారావు

కవిటి: కొత్తపుట్టుగ గ్రామంలో వేంకటేశ్వర స్వామి దేవాలయం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. తిరుపతిలో శ్రీవారిని మంగళవారం దర్శించుకున్న అనంతరం భూమనను ఎమ్మెల్సీ కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కవిటి ఎంపీపీ కడియాల పద్మ, మాజీ ఎంపీపీ నర్తు చామంతి, నర్తు కింగ్, ప్రియాంక ఉన్నారు.

రైలు నుంచి జారిపడిన వ్యక్తి మృతి

టెక్కలి రూరల్: రైలు ఎక్కే ప్రయత్నంలో జారిపడిన ఘటనలో వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటన నౌపడ రైల్వేస్టేషన్‌లో మంగళవారం చోటుచేసుకోగా.. విశాఖపట్నానికి చెందిన చెంచుల భానుచంద్రరావు (37) ప్రాణాలు కోల్పోయాడు. స్థానికులు, రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భానుచంద్రరావు తన భార్య రోజా, కుమార్తెతో కమిసి నాన్నమ్మ వరుసైన వృద్ధురాలు మృతి చెందడంతో మూడు రోజుల క్రితం సంతబొమ్మాళి మండలం యామలపేట వచ్చారు. మంగళవారం మూడో రోజు కార్యక్రమాలు ముగియడంతో భార్య, కుమార్తెను ఇక్కడే విడిచిపెట్టి భానుచంద్రరావు విశాఖ వెళ్లేందుకు ఈఎంయూ ట్రైన్ బయలుదేరే సమయంలో ఎక్కే ప్రయత్నంలో జారిపోయి ప్లాట్‌ఫాం మధ్యలో పడిపోయాడు. గమనించిన రైల్వే పోలీసులు అతన్ని బయటకు తీసి టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అయితే వైద్యులు పరీక్షలు చేసి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై రైల్వే పోలీసులు వివరాలు సేకరించి కేసునమోదు చేశారు.

పార్టీ విజయానికి కృషి చేయండి

కోటబొమ్మాళి: రానున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని టెక్కలి వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దువ్వాడ శ్రీనివాస్ కోరారు. తిలారు పంచాయతీలో ఎంపీటీసీ సభ్యుడు తర్ర అప్పలనాయుడు, సర్పంచ్ ప్రమీళ, స్థానిక నాయకులతో మంగళవారం పార్టీ పటిష్టతపై చర్చించారు.

నాడు శిథిలం - నేడు కార్పొరేట్‌కు దీటుగా..

- నేడు సోంపేట సామాజిక ఆస్పత్రి నూతన భవనాలు ప్రారంభం
- ప్రజలకు అందనున్న మెరుగైన వైద్య సేవలు



ప్రారంభానికి సిద్ధం అయిన సోంపేట సామాజిక ఆసుపత్రి నూతన భవనం




శిథిలావస్థలో ఉన్న భవనం (ఫైల్)

సోంపేట: ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల పరిధిలోని సోంపేట, కంచిలి, మందస మండలాల పేద ప్రజలకు సోంపేటలోని సామాజిక ఆస్పత్రే వైద్యానికి దిక్కు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ముందు పది సంవత్సరాలు శిథిల భవనంలోనే ఆస్పత్రిని కొనసాగించారు. దీంతో వర్షాకాలంలో వైద్యసిబ్బంది, రోగులు ఇబ్బందులు పడేవారు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో ఆ పార్టీ స్థానిక నాయకులు నూతన భవనాలు మంజూరు చేయిస్తామని హామీలిచ్చి మరిచిపోయారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు. దీంతో సోంపేట సామాజిక ఆస్పత్రిపై ప్రత్యేక దృష్టిసారించారు. నిధులు మంజూరు చేసి పాతభవనాల స్థానంలో కొత్తవి నిర్మించి కార్పొరేట్ ఆస్పత్రికి దీటుగా తీర్చిదిద్దారు. దీంతో సోంపేట, కంచిలి, మందస మండలాలకు చెందిన సుమారు రెండు లక్షల మంది పేద ప్రజలకు మౌలిక వసతులతో కూడిన మెరుగైన వైద్యం అందే అవకాశం వచ్చింది. ఆస్పత్రి భవనాలను బుధవారం జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ప్రజాప్రతినిధులు ప్రారంభించనున్నారు.

రూ. 4.60 కోట్ల నిధులతో..

ఆస్పత్రి శిథిలావస్థకు చేరుకుందని నూతన భవనాలు నిర్మాణాలు చేపట్టాలని స్థానిక ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, జెడ్పీటీసీ సభ్యురాలు తడక యశోద, పరిసర గ్రామాల ప్రజలు మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన వారు సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం రూ. 4.60 కోట్ల నాబార్డ్ నిధులను మంజూరు చేశారు.

వైద్యానికి పెద్దపీట



ప్రజారోగ్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారు. గతంలో ఒక ప్రభుత్వం పనులు ప్రారంభిస్తే ఇంకో ప్రభుత్వం ప్రారంభించేది. ప్రస్తుత సీఎం జగన్ హయాంలోనే పనులు ప్రారంభించి పూర్తి చేశాం. ఇది ముఖ్యమంత్రి పాలనకు నిదర్శనం.

– డాక్టర్ నిమ్మన దాస్, ఎంపీపీ, సోంపేట

సీఎం జగన్‌కు రుణపడి ఉన్నాం



నియోజక వర్గంలోని అన్ని సామాజిక, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్ నిధులు మంజూరు చేశారు. గతంలో శిథిల భవనాల్లోనే సిబ్బంది పనిచేసేవారు. నేడు నూతన భవనాల్లో అన్ని వసుతులతో వైద్య సేవలు అందుతున్నాయి. సోంపేట సామాజిక ఆస్పత్రికి నూతన భవనం మంజూరు చేయడంతోపాటు పూర్తిస్థాయి సిబ్బందిని నియమించడం అభినందనీయం. ముఖ్యమంత్రికి ఇచ్ఛాపురం నియోజకవర్గ ప్రజలంతా రుణ పడి ఉన్నాం.

– పిరియా సాయిరాజ్, మాజీ ఎమ్మెల్యే

సీఎం జగన్ దేశానికే ఆదర్శం

- వలంటీర్లకు వందనంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్



వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

సంతబొమ్మాళి: వలంటరీ వ్యవస్థను తీసుకొచ్చి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి అందజేసి ప్రజల మన్ననలను పొందుతున్నారని అన్నారు. కరోనా కష్ట సమయంలో కూడా వలంటీర్లు తమ సేవలను అందించారని గుర్తుచేశారు. వలంటీర్ల సేవలు చూసి చంద్రబాబు, అచ్చెన్నాయుడులకు భయం పట్టుకున్నదన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు టీడీపీని బంగాళాఖాతంలో కలపడం ఖాయమన్నారు. అంతకు ముందు మండలంలోని గ్రామవలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్రా అవార్డులతో సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు వలంటీర్లు మాట్లాడుతూ.. ప్రభుత్వం అందజేస్తున్న సేవల్లో తమకు భాగస్వామ్యం చేసినందుకు గర్వంగా ఉందని, సంఘంలో గౌరవ మర్యాదలు పెరిగాయని అన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు పాల వసంతరెడ్డి, ఎంపీపీ మేరుగు రాజేశ్వరి, పీఏసీఎస్ అధ్యక్షుడు కెళ్లి జగన్నాయకులు, ఎంపీడీవో ఉమాసుందరి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం.అప్పారావు, ఎస్.భీమారావు, పి.రామకృష్ణ, కె.సతీష్, ఎం.భాస్కర్ రెడ్డి, పి.శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

స్నేహితుడి కుటుంబానికి అండగా..



విజయకుమారికి సాయాన్ని అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

కాశీబుగ్గ: కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఔదార్యాన్ని చాటుకున్నారు. కలిసి చదువుకున్న స్నేహితుడు సూరి నాగరాజు అనారోగ్యంతో మరణించాడు. వీరి కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో పలాసను విడిచి విజయనగరం జిల్లా చీపురుపల్లి వెళ్లిపోయారు. నాగరాజు చనిపోయిన విషయం తెలుసుకున్న పూర్వవిద్యార్థులు రూ. 1.50 లక్షలు సేకరించారు. ఈ మొత్తాన్ని చీపురుపల్లిలోని నాగరాజు ఇంటికి మంగళవారం వెళ్లి అతని తల్లి విజయకుమారికి అందజేసి అండగా నిలిచారు. పూర్వవిద్యార్థులు సూరి, సంతోష్‌కుమార్, జామి శ్రీనివాస్, జోగి ఉమా, పొట్నూరు జయరాం ఉన్నారు.

ప్రజల చెంతకే ప్రభుత్వం

- వలంటీర్ల సత్కారం సభలో మంత్రి సీదిరి అప్పలరాజు



మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

కాశీబుగ్గ: సంక్షేమ పథకాల కోసం కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగిపోయే పరిస్థితుల నుంచి పేదవాడి ఇంటికే ప్రభుత్వ రంగాలు నడుచుకుంటూ వెళ్తున్నాయని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాసలోని మంత్రి క్యాంప్ కార్యాలయం ఆవరణలో మంగళవారం నిర్వహించిన పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండలాలు, పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన 1363 మంది వలంటీర్లతో నిర్వహించిన 'వలంటీర్లకు వందనం' కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఐదుగురికి సేవా వజ్ర, 20 మందికి సేవా రత్న, 1338 మందికి సేవా మిత్ర అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అభివృద్ధి, ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందాయని భావిస్తేనే తమను గెలిపించాలని అన్నారు. కరోనా సమయంలో ప్రజలకు అండగా నిలిచింది వలంటీర్లేనని గుర్తు చేశారు. నాకేంటి లాభం అని అనుకునే రోజులలో నావలన సమాజానికి ఏమి జరుగుతుందనే ఉద్దేశంతో పనిచేసేవారే వలంటీర్లని అన్నారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు 980 కిలోమీటర్ల విస్తీర్ణం ఉన్న సముద్రతీరానికి ఏమి చేయలేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అనతికాలంలో పోర్టులను నిర్మించడంతో వలసలు వెళ్లినవారంతా తిరిగివచ్చి ఉపాధి పొందుతారని అన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బోర క్రిష్ణారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు పైల వెంకటరావు, ఎంపీపీ డొక్కరి దానయ్య, ఉంగ సాయిక్రిష్ణ, జెడ్పీటీసీ సభ్యులు సవర చంద్రమ్మ, హెచ్ వెంకటరావుదొర, పానిల శ్రీనివాసరావు, బోర చంద్రకళ, మున్సిపల్ కమిషనర్ నాగేంద్రకుమార్, డబ్బీరు భవానీశంకర్ ఉన్నారు.

సంక్షేమ సారథులు వలంటీర్లు

- వైఎస్సార్‌సీపీ పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు తిలక్, శ్రీనివాస్



వలంటీర్లను సత్కరిస్తున్న పేరాడ తిలక్, దువ్వాడ శ్రీనివాస్

నందిగాం: సంక్షేమ సారథులు వలంటీర్లని వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంటు, టెక్కలి అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు పేరడ తిలక్, దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. నందిగాం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు.అర్హులైన ప్రతీ కుటుంబానికి ప్రభుత్వ పథకాలు నేరుగా అందజేయాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపకల్పన చేసిన గ్రామ వలంటీర్ వ్యవస్థ దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. ఇటువంటి వలంటీర్లపై ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు, విమర్శలు చేసినా వాటిని ఎదురొడ్డి ప్రతీ కుటుంబానికి ఎంతో పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందజేసిన సారథులుగా వలంటీర్లు నిలిచిపోయారన్నారు. తిలక్ మాట్లాడుతూ..గతంలో ఒక ప్రభుత్వ పథకం అందాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ ప్రదక్షిణలు చేయడమే కాకుండా వాళ్ల ఇంట్లో ఊడిగం చేయాల్సిన దుస్థితి ఉండేదన్నారు. దువ్వాడ శ్రీనివాస్ మాట్లాడుతూ.. సీఎం జగన్ ఎంతో మంచి ఉద్దేశంతో రూపకల్పన చేసిన గ్రామ వలంటీర్ వ్యవస్థతో ఎంతో మంది కుటుంబాలకు నేరుగా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఎంపీపీ ఎస్.శ్రీరామ్మూర్తి, మండల పార్టీ అధ్యక్షుడు టి.ఫాల్గుణరావు, నాయకులు చిన్ని జోగారావు, జె.జయరాం పాల్గొన్నారు.

నేడు టెక్కలిలో వలంటీర్లకు వందనం

టెక్కలి మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో బుధవారం వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు.

వలంటీర్లతోనే సక్రమంగా సంక్షేమ పథకాలు అమలు

- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ



వలంటీర్లకు పురస్కారాలు ప్రదానం చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ

కంచిలి: వలంటీర్లతోనే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు సక్రమంగా అందుతున్నాయని జెడ్పీ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా విజయ అన్నారు. మండలస్థాయిలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో మంగళవారం సాయంత్రం నిర్వహించారు. వలంటీర్లు కొర్రాయి జ్యోతి (బొగాబెణి), గేదెల సంధ్య(బూరగాం)లకు సేవా వజ్ర, కడియం అరుణ(పోలేరు), మద్దిల కవిత (బూరగాం), సాహు బసంతి(తలతంపర–1), పలాస లలిత (డి.జి.పురం), సాహు చంద్రకళ (కొక్కిలిపుట్టుగ)లకు సేవా రత్న, 323 మందికి సేవా మిత్ర పురస్కారాలను అందజేశారు. సేవ వజ్ర పురస్కారానికి రూ. 45 వేలు, సేవా రత్న పురస్కారానికి రూ. 30 వేలు, సేవా మిత్రలకు రూ. 15 వేలు వారి బ్యాంకు అకౌంట్లకు నేరుగా జమ కానున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, ఎంపీడీవో నీరజ, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గుమ్మడి రామదాసు, మండల జేసీఎస్ కన్వీనర్ కె.సురేష్, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు లడ్డు కేశవపాత్రో, పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రత్తి అన్వేష్, మున్సిపల్ వార్డు కౌన్సిలర్ సాడి జగన్నాథరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

టెక్నీషియన్లకు శిక్షణ

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి ఆవరణలో 108 వాహన ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లకు శిక్షణ తరగతులు మంగళవారం నిర్వహించారు.

లక్ష్మీ నరసింహాస్వామిని దర్శించుకున్న తిలక్, దువ్వాడ

సంతబొమ్మాళి/టెక్కలి: భీష్మ ఏకాదశి సందర్భంగా సంతబొమ్మాళి మండలం చెట్లతాండ్ర గ్రామంలోని పరవస్తు అయ్యవారు లక్ష్మీ నరసింహాస్వామి వారిని వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్, టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి దువ్వాడ శ్రీనివాస్ తదితరులు మంగళవారం రాత్రి దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో సంప్రదాయంగా కొనసాగుతున్న అరటి గెలల ఉత్సవం గురించి తెలుసుకున్నారు. నాయకులు పంగ రామయ్య, అప్పన్న ఉన్నారు.


లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీకావాలి

ఇచ్ఛాపురం: మార్చి తొమ్మిదో తేదీన నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా న్యాయవాదులు సహకరించాలని స్థానిక జూనియర్ సివిల్‌జడ్జి పి.పరేష్‌కుమార్ సూచించారు. సివిల్‌జడ్జి కోర్టు ఆవరణలో న్యాయవాదులతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజీ చేయదలచిన కేసులు తప్పక రాజీఅయ్యేలా కక్షిదారులతో చర్చించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు దేవరాజు, సీతయ్య, నాగరాజుపాత్రో, నారాయణ, భగవాన్‌దాస్, లక్ష్మీనారాయణ, ప్రేమలతాదేవి, వరలక్ష్మి, ఎన్‌సీ సాహు, మనోజ్, జగ్గారావు, రంగారావు, సోమశేఖర్, మురళి, ప్రసాద్ ఉన్నారు.

అందరికీ సమన్యాయం

కోటబొమ్మాళి: సమాజంలో ప్రతి వ్యక్తికి కుల, మత, వర్ణ వివక్షత లేకుండా సమాన న్యాయం అందించడమే న్యాయస్థానాల విధి అని కోటబొమ్మాళి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి బి.ఎం.ఆర్.ప్రసన్నలత అన్నారు. మంగళవారం సామాజిక న్యాయదినోత్సవం సందర్భంగా కోర్టు ఆవరణలో జరిగిన ప్రత్యేక న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దుంపల నరసింహమూర్తి, ఏపీపీ డి.హరిప్రియ, ఏజీపీ ఎస్.తిరుపతి పాల్గొన్నారు.

సూక్ష్మపోషకాల వినియోగంతో కొబ్బరిలో అధిక దిగుబడులు



కొబ్బరి క్షేత్రాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

కంచిలి: కొబ్బరిలో అధిక దిగుబడులు సాధించడానికి సూక్ష్మ పోషకాలైన బోరాన్, జింక్, మెగ్నీషియం తప్పనిసరిగా తోటల్లో వినియోగించాలని పెద్దపేట ఉద్యాన పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.వి.కె.భగవాన్ సూచించారు. జిల్లా ఉద్యానశాఖ ఆధ్వర్యంలో మకరాంపురం, చిన్నకొజ్జిరియా గ్రామాల్లో కొబ్బరి క్షేత్రాల్లో శాస్త్రవేత్తల బృందం మంగళవారం పర్యటించి పరిశీలించింది. ఈ సందర్భంగా కొబ్బరి అభివృద్ధి సంస్థ ద్వారా ఆర్ అండ్ ఆర్ పథకం అమలు చేస్తున్న క్షేత్రాలను కొబ్బరి అభివృద్ధి సంస్థ సభ్యులు కలిసి సందర్శించారు. మకరాంపురంలో రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. డీడీ ఎస్.కుమార్‌వేల్, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ సుజాత, జిల్లా ఉద్యానశాఖ అధికారి ఆర్.వి.వి.ప్రసాద్, సీడీబీ సభ్యులు కిరణ్ పాల్గొన్నారు.

మానవునికి ఆధ్యాత్మిక చింతన అవసరం



మాట్లాడుతున్న స్వామి మాధవానంద

మందస: ప్రతిమనిషికి ఆధ్యాత్మిక చింతన అవసరమని హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన స్వామి మాధవానంద, యోగాశ్రమాధిపతి యోగిని మాతాలక్ష్మీభాయి అన్నారు. బొగాబందలోని యోగాశ్రమంలో భీష్మ ఏకాదశి వేడుకలు మంగళవారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి వారు మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తోందన్నారు. వేకువజామున నాలుగు గంటలకు అఖండజ్యోతి, శంఖధ్వనితో ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.

వైఎస్సార్‌సీపీ విజయానికి సమిష్టిగా పనిచేద్దాం

- వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిలక్



మాట్లాడుతున్న పేరాడ తిలక్

నందిగాం: రానున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కార్యకర్తలంతా సమిష్టిగా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ కోరారు. నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామ్మూర్తి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో మంగళవారం మండలంలోని ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతీ కుటుంబానికి ఎంతో మంచి జరిగిందన్నారు. ఇదే విషయాన్ని గ్రామస్థాయిలో విస్తృతంగా వివరించాల్సిన అవసరం ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు టి.ఫాల్గుణరావు, నాయకులు యర్ర చక్రవర్తి, చిన్ని జోగారావు, ఎ.విష్ణు, కె.నారాయణమూర్తి ఉన్నారు.

మాతృభాష ఎంతో మధురం



మాట్లాడుతున్న కళాపీఠం అధ్యక్షుడు కూర్మారావు

మందస: మాతృభాషపై అందరికీ మమకారం ఉంటుందని, మాతృభాష ఎంతో మాధుర్యమైనదని పలువురు భాషా ప్రేమికులు అన్నారు.

మందస పట్టణంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో మంగళవారం అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవం గిడుగు రామ్మూర్తి తెలుగు భాష, జానపద కళాపీఠం ఆధ్వర్యంలో జరిగింది. వక్తలు మాట్లాడుతూ.. తెలుగు, ఒడియా తదితర మాతృభాషలతో పాటు ఆదివాసీ భాషలైన సవర, జాతాపు, గడబ, రెల్లి, ఎరుకల, పైడి భాషలు అంతరించిపోకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మాతృభాష వస్తే, అన్ని భాషలు వస్తాయన్నారు. అనంతరం తెలంగాణా కళాకారుడు యాదగిరి, సాలీన జోగారావు, కోటేశ్వరరావుల బృందం ఆట, పాటలతో అలరించారు.

మంచిచేసే నాయకుడిని ఎన్నుకోవాలి



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రకాశ్ తదితరులు

టెక్కలి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రూపకల్పన చేసిన వన్ మ్యాన్ వన్ ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని మనకు మంచి చేసే నాయకుడిని ఎన్నుకునే విధంగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సినీ నిర్మాత డాక్టర్ బలగ ప్రకాశ్ సూచించారు. టెక్కలిలో మంగళవారం సమాలోచన సభను నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. మన బలగం, మన బలం అంబేడ్కర్ అని పేర్కొన్నారు. ఓటు హక్కును వజ్రాయుధంగా మలచుకోవాలని కోరారు. రానున్న ఎన్నికల్లో ప్రజలంతా సమాలోచనతో ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఓటును లాక్కునే రోజులు పోయావన్నారు. కార్యక్రమంలో రామాంజనేయులు, ఎస్.బుజ్జి, శాంతారావు, శ్రీను, డి.రవికుమార్, కొండ, కె.వేణు, డి.రాజ్‌కుమార్, సీహెచ్ దిలీప్, ఉదయ్‌భాస్కర్, డి.దమయంతి ఉన్నారు.